TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-205 పేజీలు:-4 గురువారం 09-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## ఇరాన్ నన్ను హత్య చేయాలని చూస్తోంది

ట్రంప్ సంచలన ఆరోపణలు



- ఇరాన్ మొదటి టార్గెట్ తానేనన్న ట్రంప్
- 47 ఏళ్లుగా ఇరాన్ వైఖరి మారలేదన్న అమెరికా అధ్యక్షుడు
- ప్రస్తుత నాయకత్వం కాస్త హేతుబద్ధంగా ఉందని వ్యాఖ్య
- ఇరాన్‌పై మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరిక
- చర్చలు జరిపి సమయం వృథా అని వ్యాఖ్య

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తనను హత్య చేసేందుకు కుట్ర పన్నే అవకాశం ఉందని, తాను వారి 'నంబర్-1 టార్గెట్'నని అన్నారు. అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా - మిగతా 2 లో

## జార్జియా మెలోనీ మంచిదే కానీ ఇరాన్ విషయంలో హ్యాండ్ ఇచ్చింది



- హర్మూజ్, ఇరాన్ వ్యవహారంలో ఇటలీ సహాయ నిరాకరణ చేసిందన్న ట్రంప్
- జీ-7 సదస్సులో ఫొటో వివాదంపై ఇరునేతల మధ్య విభేదాలు
- దెబ్బతిన్న అమెరికా - ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీల మధ్య దౌత్యపరమైన విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. తుర్కియే రాజధాని అంకారాలో జరుగుతున్న నాటో శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇటలీ ప్రధాని మెలోనీ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చారు. జార్జియా మెలోనీ మంచి వ్యక్తి అని, - మిగతా 2 లో

## 'మీరు ఇవ్వలేదు మేమే కొట్లాడి తెచ్చుకున్నాం' కిషన్ రెడ్డిపై భట్టి ఫైర్



- తాడిచెర్ల-2పై భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు
- కొత్త కేటాయింపు కాదన్న డిప్యూటీ సీఎం
- 2013లోనే యూపీఏ సింగరేణికి కేటాయించిందని వెల్లడి
- మైనింగ్ లీజు అనుమతులు ఆలస్యమయ్యాయని విమర్శ
- అన్ని సింగరేణి గనులు సంస్థకే ఇవ్వాలని డిమాండ్

తెలంగాణలో తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ అంశం రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర - మిగతా 2 లో

## నాకు మంత్రి పదవి ఇవ్వండి నీళ్లు తెచ్చి చూపిస్తా



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెస్తానన్న హరీశ్
- విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ఆరోపణ

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు - మిగతా 2 లో

# పెట్టుబడుల సదస్సుకు తరలిరండి!




- పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు తెలంగాణ మంచి వేదికగా నిలుస్తుందన్నారు.
- కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు.
- భారత్‌లో కెనడా హై కమిషనర్ క్రిస్ కూటర్ బుధవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ ఏడాది డిసెంబరులో నిర్వహించనున్న 2వ తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాలని కెనడాకు చెందిన కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు తెలంగాణ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. భారత్‌లో కెనడా హై కమిషనర్ క్రిస్ కూటర్ బుధవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

# రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

- 'యూజీసీ నెట్' పేపర్ లీకైందని ఆరోపణ
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'నీట్' పేపర్ లీకేజీ వివాదం
- ముగియకముందే మరో ప్రశ్నపత్రం లీకేజీ ఘటన తెరపైకి వచ్చింది
- పరీక్షకు ముందే యూజీసీ-నెట్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్ లీకైనట్టు ఆరోపణలు వస్తున్నాయి.



ఇంటర్నెట్ డెస్క్: నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్(ఖ+జ-చీజు) సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ

## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్

రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్



- పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్
- కేర్‌వెల్ ఏవియేషన్ గ్రూప్‌తో లావాదేవీలపై దర్యాప్తు
- పార్టీ నిధులతో విమానం, హెలికాప్టర్ కొని లీజుకు తీసుకున్నట్లు ఆరోపణలు

పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ - మిగతా 2 లో

## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు

గడ్కరీ ఘాటు కౌంటర్



- ఇథనాల్‌తో తనకు లాభం లేదన్న గడ్కరీ
- ఇథనాల్ ఉత్పత్తిలో తమ కంపెనీ వాటా కేవలం 0.07 శాతమేనని వెల్లడి
- ఆరోపణలను పూర్తిగా ఖండించిన కేంద్ర మంత్రి
- వాహనాలు దెబ్బతిన్నాయని ఆధారాలు చూపాలని సవాల్
- ఫిర్యాదులు వస్తే విచారణ చేస్తామని హామీ

ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ - మిగతా 2 లో

## బుసాన్‌లో స్మార్ట్ షూ ఫ్యాక్టరీని సందర్శించిన లోకేశ్

అధునాతన టెక్నాలజీపై ఆసక్తి



- బుసాన్‌లో షూఅల్స్ ఫ్యాక్టరీని సందర్శించిన లోకేశ్
- స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ తయారీ పరిశీలన
- మాగ్నెటిక్ జనరేటర్లు, ప్రత్యేక చిప్‌లపై ఆసక్తి
- ఏఐ ఆధారిత మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్న సంస్థ

దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ - మిగతా 2 లో

## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం



- అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ చిన్నారి నిరంజన్ మృతి
- గత నెలలోనే హనుమకొండకు వెళ్లి నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- చిన్నారి మనల్ని విడిచి వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన

జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, తెలంగాణలోని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) అరుదైన - మిగతా 2 లో

# ఏపీ విద్యార్థులకు శుభవార్త

# డైట్ ఛార్జీలు 10% పెంపు

- హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు 10 శాతం డైట్ ఛార్జీల పెంపు
- రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు
- ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన
- పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం
- కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన



ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 09-07-2026

# పెట్టుబడుల సదస్సుకు తరలిరండి!

మొదటి పేజీ తరువాయి – హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్‌సిటీ వంటి ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై మాట్లాడుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణ సాధించిన పురోగతిని క్రిస్ కూటర్‌కు వివరించారు. ఫార్చ్యూన్-500 కంపెనీల గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మూసీ నది పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, నదీ తీరాన్ని అభివృద్ధి చేసి కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యంతో పని చేస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామన్నారు. పలు విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, కెనడాకు చెందిన వర్సిటీలు కూడా ఈ అవకాశాన్ని పరిశీలించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని కోరారు. క్రిస్ కూటర్ స్పందిస్తూ.. ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌ను కెనడా పర్యటనకు ఆహ్వానించారు. త్వరలో కెనడా వాణిజ్య ప్రతినిధుల బృందం తెలంగాణకు వచ్చి ఇంధనరంగం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్య అవకాశాలపై చర్చిస్తుందని తెలిపారు. ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ క్రిస్ కూటర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

### ఖమ్మంలో 300 కోట్ల ప్రాజెక్టు..

సీఎం రేవంత్‌రెడ్డిని గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, గోద్రేజ్ ఆగ్రోవెట్ ఆయిల్‌పామ్ బిజినెస్ సీఈవో సౌగతో నియోగి బుధవారం కలుసుకున్నారు. ఖమ్మం జిల్లాలో గోద్రేజ్ కంపెనీ రూ.300కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న సమీకృత ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో దాని గురించి చర్చించారు. ఈ కాంప్లెక్స్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుందని కంపెనీ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. ప్రాసెసింగ్ మిల్ కోసం రహదారిని విస్తరించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు. మరోవైపు, గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్-2026లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వచ్చిన మలేషియా పార్లమెంటు సభ్యుడు శరవణన్, పలు విదేశీ కంపెనీల ప్రతినిధులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

### వైఎస్ఆర్‌కు సీఎం రేవంత్ నివాళి

ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. సీఎం రేవంత్ నివాసంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. గాంధీభవన్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ కేవీపీ రామచందర్‌రావు, ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్, ఏఐసీసీ కార్యదర్శి కుసుమ్‌కుమార్, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్‌రావు, నాయిని నివాళులర్పించారు.

## బుసాన్‌లో స్మార్ట్ షూ ఫ్యాక్టరీని సందర్శించిన లోకేశ్

మొదటి పేజీ తరువాయి – బుసాన్‌లోని ప్రముఖ షూఆల్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్‌ను తయారు చేస్తున్న ఈ సంస్థలో అధునాతన సాంకేతికతతో బూట్ల తయారీ విధానాన్ని పరిశీలించారు. రక్త ప్రసరణను మెరుగుపరచడం, కండరాల అలసటను తగ్గించడం కోసం మాగ్నెటిక్ జనరేటర్లు, ప్రత్యేక చిప్‌లతో బూట్లను తయారు చేసే విధానాన్ని లోకేశ్ ఆసక్తిగా తిలకించారు. నడకలో అసౌకర్యాన్ని తగ్గించి పాదాలను ఆరోగ్యంగా ఉంచేందుకు మెడిచియో వైబ్రేషన్ చిప్‌లను బూట్లలో అమర్చే ప్రక్రియను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా షూఆల్స్ ప్రతినిధులు తమ ఉత్పత్తుల ప్రత్యేకతను వివరించారు. మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్జార్ప్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బ్యాక్టీరియల్ మెటీరియల్స్‌ను కలిపి ఎంఎఫ్‌డీఎస్ సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్‌ను తయారు చేస్తున్నట్లు తెలిపారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి ఏఐ ఆధారిత స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. థెరపిటిక్ షూను చేతితో తయారు చేయడంతో పాటు స్మార్ట్ హెల్త్‌కేర్, నొప్పి నివారణకు ఉపయోగపడే ఎర్గోనమిక్ డిజైన్‌ను వైద్య సాంకేతికతతో కలిపి రూపొందిస్తున్నట్లు వివరించారు. మెడికల్, ఎర్గోనమిక్ టెక్నాలజీల్లో తమకు పేటెంట్లు ఉన్నాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పాదాల్లో గాలి ప్రసరణ సులభంగా జరిగేలా ఇన్వెన్షియో కూలర్ సిస్టమ్‌ను ఉపయోగిస్తున్నామని చెప్పారు. దీంతో పాదాలు చల్లగా ఉండటంతో పాటు దుర్వాసన సమస్య కూడా తగ్గుతుందని వివరించారు.ఱ

## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

మొదటి పేజీ తరువాయి – జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ నిన్న రాత్రి కన్నుమూశాడు. ఈ వార్త తెలియగానే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సోషల్ మీడియా వేదికగా నిరంజన్‌ను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగాన్ని ఆయన వ్యక్తం చేశారు. “నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్దిరోజుల క్రితమే హనుమకొండలో వాళ్ల ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా నా కళ్లముందే కదలాడుతున్నాయి. అంతటి భయంకరమైన అనారోగ్యంతో పోరాడుతూ కూడా నన్ను చూడగానే ఆ చిన్నారి ముఖంలో విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం. శరీరం వ్యాధితో క్షీణిస్తున్నా… మనసు నిండా కొండంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అంతటి ధైర్యశాలి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోతున్నా. ఆ చిన్నారి చూపిన ప్రేమ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది” అంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు. గత నెలలోనే నిరంజన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా హనుమకొండ వెళ్లి అతడిని పరామర్శించారు. ఆ సమయంలో నిరంజన్‌ను గుండెలకు హత్తుకుని, తిరుమల ప్రసాదం ఇచ్చి, సెల్ఫీ కూడా దిగారు. తనకు ఒక కుక్కపిల్ల కావాలని అడగ్గానే… ఆ రోజే కుక్కపిల్లను పంపించారు. అంతేకాదు, “నేను ‘ఓజీ 2’ తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్.. ఇద్దరం కలిసి సినిమా చూద్దాం” అని పవన్ మాట ఇచ్చారు. కానీ, ఈ లోపే చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఫ్యాన్స్ ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు, బాలీవుడ్ రియల్ హీరో సోనూ సూద్ సైతం నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆ కుటుంబానికి తానున్నానంటూ కొండంత ధైర్యాన్ని అందించారు.

## ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

మొదటి పేజీ తరువాయి – ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

## ‘మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం’.. కిషన్ రెడ్డిపై భట్టి ఫైర్

మొదటి పేజీ తరువాయి – ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే ఈ బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గట్టి కౌంటర్ ఇచ్చారు. ఇది కొత్త కేటాయింపు కాదని, రాష్ట్ర ప్రభుత్వం పోరాడి అనుమతులు తెచ్చుకుందని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. తాడిచెర్ల-2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం సంతోషకరమేనని చెప్పారు. అయితే ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాస్తవాలను దాస్తున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాడిచెర్ల-2 బొగ్గు గనిని 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని భట్టి తెలిపారు. అలాంటప్పుడు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించింది ఏంటని ప్రశ్నించారు. బ్లాక్ కేటాయించినప్పటికీ మైనింగ్ లీజుకు అవసరమైన అనుమతులు మాత్రం ఇవ్వలేదని చెప్పారు. కొత్త చట్టం ప్రకారం తాడిచెర్ల-2ను సింగరేణికి ఇవ్వబోమని కేంద్రం చెప్పిందన్నారు. అయితే ఆ చట్టం అమల్లోకి రాకముందే ఈ బ్లాక్ సింగరేణికి కేటాయించిన విషయాన్ని తాము ప్రధాని, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పోరాడటంతో చివరకు అనుమతులు వచ్చాయని చెప్పారు. ఇప్పటికైనా అనుమతులు ఇచ్చినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణపై నిజంగా బీజేపీకి ప్రేమ ఉంటే సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని భట్టి డిమాండ్ చేశారు. అదే తెలంగాణ ప్రయోజనాలను కాపాడే నిర్ణయమవుతుందని అన్నారు.

## నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్



మొదటి పేజీ తరువాయి – మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం, అలాగే సీబీఐ విచారణకు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

## ఇరాన్ నన్ను హత్య చేయాలని చూస్తోంది

మొదటి పేజీ తరువాయి – మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ అదే విధమైన వైఖరిని కొనసాగిస్తోందన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న నాయకత్వం గతంతో పోలిస్తే కొంత హేతుబద్ధంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న చర్చలు ఇక ప్రయోజనం లేవని ట్రంప్ స్పష్టం చేశారు. “ఈ రాత్రే ఇరాన్‌పై మళ్లీ తీవ్ర దాడులు చేస్తాం. వారు రోజూ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారు” అని హెచ్చరించారు. కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చర్చలు కొనసాగించాలని చర్చల బృందం భావిస్తే కొనసాగించవచ్చని, కానీ వాటిపై తనకు నమ్మకం లేదన్నారు. మరోవైపు, అమెరికా బుధవారం జరిపిన వైమానిక దాడుల్లో తమ సైన్యానికి చెందిన ఎనిమిది మంది సైనికులు మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. దక్షిణ ఇరాన్‌లోని బందర్ అబ్బాస్, బుషెహర్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయని పేర్కొంది. అమెరికా ఏకపక్ష దాడులతో ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## జార్జియా మెలోనీ మంచిదే కానీ.. ఇరాన్ విషయంలో హ్యాండ్ ఇచ్చింది

మొదటి పేజీ తరువాయి – ఆమె అంటే తనకు అభిమానమని చెబుతూనే, ఇరాన్ విషయంలో అమెరికాకు సాయం చేసేందుకు నిరాకరించారని విమర్శించారు. ఈ నిర్ణయం కారణంగానే ఇరుదేశాల మధ్య సంబంధాలు కొంతమేర దెబ్బతిన్నాయని ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానించారు. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వ్యవహారంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాకు మద్దతు ఇచ్చేందుకు ఇటలీ నిరాకరించిందని ట్రంప్ వెల్లడించారు. అయినప్పటికీ తాము మెలోనీపై ఎటువంటి ఒత్తిడి తీసుకురాలేదని స్పష్టం చేశారు. అయితే ఇటలీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక పెద్ద తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాకు సొంతంగా సరిపడా ఇంధన వనరులు ఉన్నందున తాము హర్మూజ్‌పై ఆధారపడటం లేదని, కేవలం దానిని వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతంగా మాత్రమే చూస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సంక్షోభ సమయంలో ఇటలీ తమకు అండగా నిలవనందువల్లే తాను కొంత అసంతృప్తికి గురయ్యానని ఆయన ఒప్పుకున్నారు. మరోవైపు, ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ-7 సదస్సు నేపథ్యంలో ఇరునేతల మధ్య మొదలైన ‘ఫొటో వివాదం’ ఈ ఉద్రిక్తతలకు మరింత కారణమైంది. ఆ సదస్సులో తనతో ఫొటో దిగేందుకు మెలోనీ ప్రాధేయపడ్డారని, అందుకే తాను అంగీకరించానని ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దుమారం రేపాయి. అయితే ట్రంప్ చేసిన వాదన పూర్తిగా కల్పితమని, అందులో ఎంతమాత్రం నిజం లేదని మెలోనీ ఆ వ్యాఖ్యలను కొట్టిపారేశారు.

## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్



మొదటి పేజీ తరువాయి – డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన ‘కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్’కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

# ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు

మొదటి పేజీ తరువాయి – రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. ‘ఇండియా టుడే’కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు.ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు



మొదటి పేజీ తరువాయి – వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

## ఆహారం మాత్రమే కాదు.. 100 ఏళ్లకు పైగా జీవించే వారిలో ఒక ప్రత్యేక లక్షణం!

**100 ఏళ్లు జీవించడంలో వ్యక్తిత్వం కూడా కీలకమన్న అధ్యయనం**


**ఇటలీలోని సార్డీనియాలో పరిశోధన నిర్వహణ**

**125 మంది వృద్ధులపై అధ్యయనం**

**కొత్త విషయాలు నేర్చుకునే ఆసక్తి ఎక్కువగా ఉన్నట్లు గుర్తింపు**

**హాబీలు, మానసిక చురుకుదనం అధికంగా ఉన్నట్లు వెల్లడి**

**బాధ్యతాయుత వ్యక్తుల్లో జీవిత సంతృప్తి ఎక్కువ**



ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించాలంటే మంచి ఆహారం, వ్యాయామం, సామాజిక సంబంధాలే ముఖ్యమని చాలామంది భావిస్తారు. అయితే 100 ఏళ్ల వరకు జీవించే వారిలో మరో కీలక అంశం కూడా ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. అది వ్యక్తిత్వమని పరిశోధకులు చెబుతున్నారు. ఇటలీలోని సార్డీనియా ప్రాంతంలో ఈ పరిశోధన జరిగింది. ప్రపంచంలో ఎక్కువ మంది శతాధిక వయస్కులు నివసించే ‘బ్లూ జోన్స్’లో ఈ ప్రాంతం ఒకటి. అక్కడి 71 నుంచి 101 ఏళ్ల మధ్య వయసున్న 125 మందిపై పరిశోధకులు అధ్యయనం నిర్వహించారు. ఇందులో 55 మంది బ్లూ జోన్‌కు చెందినవారు. మిగిలిన 70 మంది సమీప ప్రాంతాల వారు. పాల్గొన్న వారిపై శారీరక, మానసిక ఆరోగ్యం, జీవనశైలి, అభిరుచులు, వ్యక్తిత్వ లక్షణాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ పరిశోధనలో ఆసక్తికర విషయం బయటపడింది. బ్లూ జోన్‌లో ఉన్నవారికి ఆరోగ్య పరంగా పెద్ద తేడా కనిపించకపోయినా.. వ్యక్తిత్వంలో మాత్రం స్పష్టమైన ప్రత్యేకత కనిపించింది. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి, కొత్త అనుభవాలను స్వీకరించే మనస్తత్వం, నిరంతరం నేర్చుకోవాలనే తపన బ్లూ జోన్ ప్రజల్లో ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ లక్షణాన్ని ‘ఓపెన్‌నెస్’గా పరిశోధకులు పేర్కొన్నారు. అంతేకాదు, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం, భావోద్వేగాలను నియంత్రించే నైపుణ్యం కూడా వీరిలో ఎక్కువగా కనిపించింది. మానసికంగా లేదా శారీరకంగా చురుగ్గా ఉంచే హాబీలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు పరిశోధనలో తేలింది. అధ్యయనంలో మరో విషయం కూడా వెల్లడైంది. కొత్త విషయాలపై ఆసక్తి ఎక్కువగా ఉన్నవారిలో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో పాటు హాబీల్లో చురుగ్గా పాల్గొనే అలవాటు కనిపించింది. బాధ్యతాయుతంగా ఉండే వ్యక్తులు జీవితంపై ఎక్కువ సంతృప్తిని వ్యక్తం చేశారు. మరోవైపు ఆందోళన, నెగెటివ్ ఆలోచనలు ఎక్కువగా ఉండే వ్యక్తుల్లో ఆరోగ్య సంబంధిత జీవన నాణ్యత తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అయితే వ్యక్తిత్వం ఒక్కటే ఎక్కువ కాలం జీవించడానికి కారణమని ఈ అధ్యయనం చెప్పడం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. కానీ వ్యక్తిత్వం మన అలవాట్లు, జీవనశైలిని ప్రభావితం చేస్తుందని, అదే ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి దోహదపడే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మరింత లోతైన పరిశోధనలు అవసరమని తెలిపారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 09-07-2026

# ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే అందించాలి

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి డిమాండ్...

**జూలై 08 నిజం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే అందించి ఆదుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మెండోరా గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో బుధవారం రోజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు అందించడంలో ప్రగల్బాలు మాత్రమే పలుకుతుందని, ఆచరణలో ఎక్కడ అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో, కార్పొరేట్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి విద్య అభ్యసిస్తున్నారని ఆయన అన్నారు. ఎక్కువ శాతం ఎస్సీ ఎస్టీ బీసీలు మైనార్టీ ప్రజలు ఉండడంవల్లే ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల లో పక్షవాత వైఖరి అవలంబిస్తుందన్నారు. గత 2024 - 25 సంవత్సరం 6,000 కోట్లు, 2025 - 26 సంవత్సరంలో 4,000 కోట్లు నిధులు విడుదల చేయకపోవడం వల్ల పెండింగ్లో ఉన్నాయన్నారు. దారిద్ర రేఖలో ఉన్నవాళ్లు ఫీజు రియంబర్స్మెంట్, కాలర్ షిప్లపై ఆశ పెట్టుకుని కాలేజీలలో చదువుతుంటే, ప్రభుత్వం



మాత్రం వారికి నిరాశనే మిగులుస్తుందని ఆయన అన్నారు. అంతేకాకుండా పైసా వసూలు చదవాలన్న విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సైతం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు విద్యార్థులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించి ఆదుకోవాలని ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వెంటనే ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అందించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి ప్రభుత్వాన్ని కోరారు.

# బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ వివరాలు సేకరించాలి

## ఓటర్ నమోదులో అన్ని పార్టీల వారు బూత్ లెవెల్ ఏజెంట్లు సహకరించాలి...

ఆర్మూర్ మండల **జూలై 08 నిజం న్యూస్:** మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడి. బాల్కొండ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరు ఎస్.ఐ.ఆర్. లో భాగంగా తమ ఓటు వివరాలను ఎ న్యూమరేషన్ ఫామ్ లో తమ పూర్తి వివరాలను నమోదు చేసుకుని ఆయా గ్రామ పంచాయతీలలో గాని, బిఎల్ఓ లకు గాని అందజేయాలని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన వేల్పూర్ గ్రామంలో బుధవారం రోజున బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తమ కుటుంబ సభ్యుల ఓటర్ వివరాలను స్వయంగా ఎస్ ఐ ఆర్ ఫామ్ లో వివరాలు నమోదు చేసి బి ఎల్ ఓ లకు అందజేశారు. ఈనెల 23 లోగా ప్రతి ఒక్క ఓటరు తమ పూర్తి వివరాలతో కూడిన ఎన్యుమరేషన్ ఫామ్ లో తప్పనిసరిగా వివరాలు నింపి అధికారులకు అందించాలన్నారు. ఎస్ ఐ ఆర్ లో ఓటర్ వివరాలు నమోదు చేసుకోకుంటే మీ ఓటు గల్లంతు అయ్యే అవకాశాలు ఉన్నాయని,





ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును పొందాలన్నారు. బి ఎల్ వో లు ఒకే దగ్గర కూర్చొని, వివరాలు సేకరిస్తే కుదరదని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరి ఓటు వివరాలను సేకరించి, ఎవరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా బిఎల్వోలు కృషి చేయాలన్నారు. ఓటర్ నమోదు లో ప్రజలకు అన్ని పార్టీల బూతు లెవెల్ ఏజెంట్లు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అధికారులకు, బి ఎల్ ఓ లకు, బి ఎల్ ఏ లకు పలు కీలక సూచనలు సలహాలు సూచించారు. బి ఎల్ వో లు, గ్రామపంచాయతీలలో, మందిరాలలో, సంఘభవనాలలో ఒక చోట కూర్చుండి వివరాలు సేకరించడం సరికాదన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి వార్డులో, ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను





స్వయంగా కలిసి వివరాలు సేకరించడం వల్ల ఓటర్లకు న్యాయం జరుగుతుందన్నారు. బి ఎల్ ఓ లు ఒకేచోట కూర్చుండి విధులు నిర్వహిస్తే ప్రజల ఓట్లు గల్లంతు అయ్యేఅవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి వివరాలు సేకరించి అటు తర్వాత ఆఫీసులో ఆన్లైన్లో చేయాలని ఆదేశించారు. ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత బి ఎల్ ఏ ల పై ఉందన్నారు. ప్రతి ఒకరితో ఓటరు వివరాలు నమోదు చేయించాలని బిఎల్ఓ లకు, బి ఎల్ ఏ లకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మండల తాసిల్దార్ అనిరుద్, సర్పంచ్ అశోక్, ప్రతాపరెడ్డి,బి ఎల్ వో లు, తదితరులు, పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవంఎన్ఎన్ టెక్స్టైల్స్ బోటిక్ కుశాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నివాళి అర్పించిన బేరి రామచంద్ర యాదవ్

**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 8:** శేరిలింగంపల్లి బాపూనగర్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి ఉత్సవాలకు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎన్ టెక్స్టైల్స్ బోటిక్ కుశాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని నివాళులర్పించారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు మరియు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు వైఎస్ఆర్ అభిమానులందరూ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ప్రతి ఒక్క పేదవాడు పొందాడని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి పేదలకు





అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందించిన ఘనత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కే దక్కుతుందని కొనియాడారు. పేదల ముఖ్యమంత్రిగా పిలువపడే డాక్టర్ వైఎస్ఆర్కు నివాళు లర్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందంటే అందుకు రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన సంక్షేమం నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదలు రాజశేఖర్ రెడ్డిని ఆరాధ్య దైవంగా భావిస్తారని అలాంటి నాయకున్ని మరెన్నో చూడలేమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్, శేరిలింగంపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రమశక్తి అవార్డు గ్రహీత మహేశ్వర్ రెడ్డి, ప్రభాస్ హోటల్ ప్రొప్రైటర్ రాయుడు, సూర్య చంద్ర రెడ్డి, మౌలానా, సతీష్, ఎక్సైడ్ బ్యాటరీ ఎండి సర్వర్, ఉత్తంకుమార్, చంద్రశేఖర్, పెద్ద ఎత్తున వైయస్సార్ అభిమానులు పాల్గొని జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

# జేఎన్టీయూ, కూకట్పల్లి వై జంక్షన్లతో పాటు గచ్చిబౌలి వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి లో పర్యటించి పరిశీలించిన జాయింట్ సీపీ సన్ ప్రీత్ సింగ్

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వర్షాకాలంలో ఇబ్బందులు నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు జాయింట్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచన

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 8:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ నివారణ, ట్రాఫిక్ ప్రవాహాన్ని మరింత సులభతరం చేయడం, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టడం లక్ష్యంగా జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్., బుధవారం జేఎన్టీయూ జంక్షన్, కూకట్పల్లి వై జంక్షన్లతో పాటు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన వాటర్ లాగింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ ట్రాఫిక్--2 శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., అదనపు డీసీపీ ట్రాఫిక్--2 వీరన్న, కూకట్పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్యలతో కలిసి జేఎన్టీయూ, కూకట్పల్లి వై జంక్షన్లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, వాహనాల రద్దీ, సిగ్నల్ నిర్వహణ, ట్రాఫిక్ ప్రవాహంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డీసీపీ ట్రాఫిక్--1 ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్--1 జి. హనుమంతరావుతో కలిసి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్



పరిధిలోని హెచ్సీయూ గేట్ నెం.2, ఐఐఎల్ యూ-టర్న్ వద్ద ఉన్న ప్రధాన వాటర్ లాగింగ్ ప్రాంతాలను సందర్శించి, అక్కడ కొనసాగుతున్న సమస్యల పరిష్కార పనులను పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న అంశాలను గుర్తించి, వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు జాయింట్ సీపీ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పీక్ అవర్స్లో ట్రాఫిక్ను సమర్థవంతంగా నియంత్రించడం, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఇబ్బందులు





కలగకుండా అవసరమైన ఇంజినీరింగ్, ఎన్ఫోర్స్మెంట్ చర్యలను సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా వాటర్ లాగింగ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యము కావాలి

## బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్





**బోడుప్పల్, జూలై 8,నిజం న్యూస్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బొడుప్పల్ డివిజన్లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని బొడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ నగర్లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. ప్రతి అర్హులైన పౌరుని పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత బృందాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ రాపోలు నాగేందర్, అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షులు ఊరటి మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, అనిల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాహుల్, అంబేద్కర్ నగర్ ఫేజ్--3 ప్రధాన కార్యదర్శి సత్యం చారి, స్వామి, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన అమ్మసానికి కాలనీ అసోసియేషన్ సభ్యులు

## పద్మ మహేశ్వర్ రెడ్డి బిజెపి



**మేడిపల్లి, జూలై 8, నిజం న్యూస్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బోడుప్పల్ సర్కిల్ లోని అమ్మసాని వెంకట్ రెడ్డి కాలనీ కి సంబంధించిన ఓపెన్ జిమ్ మంజూరుకు సహాయ సహకారాలు అందించిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన అమ్మసాని కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు,పద్మ మహేశ్వర్ రెడ్డి బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా సెక్రెటరీ వారు కాలనీ వాసులు ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ అంజయ్య మాట్లాడుతూ.. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించిన పద్మ మహేశ్వర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా బుధవారం



### వైయస్సార్ హెల్ప్ లైన్, వైయస్సార్సీపి

ఐ టి వింగ్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ రాజేశ్వరి వృద్ధాశ్రమం నందు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి మందులను సరఫరా చేయడం జరిగింది. వృద్ధులకు పండ్లు మధ్యాహ్న భోజనాన్ని కూడా అందించడం జరిగింది . ఈ కార్యక్రమంలో వైస్సార్ హెల్ప్ లైన్ ఫౌండర్ వెంకటరెడ్డి యక్కంటి అధికార ప్రతినిధులు కార్మూరి వెంకటరెడ్డి, శ్యామల మరియు కొండా రాజీవ్ వైస్సార్సిపీ హైద్రాబాద్ ఐటీ వింగ్ అధ్యక్షులు రోసిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పెన్షన్లు వంటి ఎన్నో పథకాల ద్వారా పేద ప్రజల హృదయాలలో వైయస్సార్ నిలిచారు అని అన్నారు

# వైయస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి

మెండోరా మండల **జూలై 08 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఎర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్ మాట్లాడుతూ, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం, అన్ని వర్గాల ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిపిన ఘనత వైఎస్సార్ దే అని అన్నారు. ఆయన ఉమ్మడి రాష్ట్రాల ప్రజలకుఅందించిన, సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సంక్షేమ పాలనకు ఆయన ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ, 108లాంటి కార్యక్రమాల తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తనదైన మార్క్ వేసుకుని ఇప్పటికి అవి కొనసాగుతు, పేదలకు ఉచితంగా ఖరీదైనా వైద్యం అందుతుందంటే,అది ఆయన ఆలోచననే అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో పలు గ్రామాలసర్పంచ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.

# గ్రామ దేవతల, శ్రీదేవి భూదేవిల కరుణకటాక్షలతో అందరూ చల్లగా ఉండాలి

## భక్తిశ్రద్ధలతో శీతాల పండుగను జరుపుకున్న ధర్పల్లి తండాల వాసులు...





**జూలై 08 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా రూరల్ నియోజకవర్గం లోని ధర్పల్లి మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాలలో గల తండాల గ్రామ ప్రజలు బుధవారం రోజున భక్తిశ్రద్ధలతో శీతాల పండుగను కన్నుల వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని ఆయా తండాల గ్రామాల ప్రజలు ప్రతి సంవత్సరం వర్షాకాలం మొదలు కావడంతో తమ గ్రామాలలో సనాతన ధర్మంగా ఆరాధించే తండా గ్రామ దేవతలకు తమ తండాల ప్రజలు ప్రత్యేక పూజలు జరిపి, గ్రామ దేవతలను, శ్రీదేవి భూదేవిలను, అన్ని గ్రామాల ప్రజలు సకుటుంబ సపరివారంగా పిల్లాపాపలతో చల్లగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పుష్కలంగా పండాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో జీవించాలని, ఆ గ్రామ దేవతల, శ్రీదేవి భూదేవిల అనుగ్రహంతో అందరూ చల్లగా ఉండాలని వేడుకున్నారు. గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి, మ్రొక్కిన మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా దేవతలను పూజించడం వల్ల దేవతల అనుగ్రహం తమకు ఎల్లప్పుడు ఉంటుందని తాండావాసుల ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తండా నాయక్, బాదావత్ తారాచంద్, కార్బారి బాదావత్, సేవాలాల్, ఆయా గ్రామాల తండాల పెద్ద మనుషులు, బాదావత్ నరేష్, బానావత్ వసంత్, బాదావత్ ఊమ్లా, బాదావత్ రావు సింగ్, మెగావత్ వినోద్, తాండ ప్రజలు, మహిళలు, పలువురు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్లాంట్ల ప్రైవేటీకరణ ప్రతిపాదనలు విరమించుకోవాలి

## పోచంపాడు జల విద్యుత్ కేంద్రం వద్ద ఉద్యోగుల నిరసన

## తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన

మెండోరా మండల **జూలై 08 నిజం న్యూస్:** వై టి పి ఎస్ (గ్రూప్) లోని స్టేజ్ వన్, స్టేజ్ 2 పరిధిలో గల యాష్ ప్లాంట్, కోల్ ప్లాంట్లను ప్రైవేటుకరించే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా





బుధవారం నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలోని పోచంపాడు జల విద్యుత్ కేంద్రం వద్ద విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ.. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను, కీలకమైన ప్లాంట్లను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే ప్రయత్నాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణ వల్ల భవిష్యత్తులో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా, విద్యుత్ రంగం కుప్పకూలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పక్కనబెట్టి, ప్లాంట్ల ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తే సహించేది లేదని ఉద్యోగులు హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రైవేటుకరణ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పోచంపాడు విద్యుత్ కేంద్రానికి చెందిన పలువురు ఉద్యోగులు, జేఏసీ ప్రతినిధులు, పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## హనుమకొండ జిల్లా ఇన్చార్జి డిఎమ్ హెచ్ ఓ డాక్టర్ టి. మదన్ మోహన్ రావు.



హనుమ కొండ ( ప్రతినిధి) **జూలై 08 నిజం న్యూస్:** ఆరోగ్య కార్యక్రమాలకు అనుగుణంగా ప్రణాళికల రూపొందించుకొని సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం హైరిస్కు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలనిలస్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సూచించారు. లస్కర్ సింగారం ఆరోగ్య పట్టణ కేంద్రాన్ని ఇంచార్జ్ డిఎంహెచ్ ఓ మదన్ మోహన్ రావు


# వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ వేడుకలను ఘనంగా నిర్వహించిన వైయస్సార్ ఐటీ వింగ్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 8:** మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా బుధవారం వైయస్సార్ హెల్ప్ లైన్, వైఎస్ఆర్సిపి ఐటీ వింగ్ ఆధ్వర్యంలో కుకట్పల్లి ఆల్విన్ కాలనీ లోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే పండ్లు మధ్యాహ్నం భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ హెల్ప్లైన్ వ్యవస్థాపకుడు వెంకటరెడ్డి యాక్కంటి , అధికార ప్రతినిధులు కార్మూరి వెంకట్ రెడ్డి, శ్యామల, కొండరాజు, వైయస్సార్ సిపి హైదరాబాద్ ఐటీరింగ్ అధ్యక్షుడు రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, పెన్షన్లు వంటి అనేక సంక్షేమ పథకాలు ద్వారా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 09-07-2026

## అస్తిత్వ భావన బలపడితే కుట్రలకు చెక్




మాకియవెల్లి అనే ప్రముఖ ఇటాలియన్ రచయిత దుర్మార్గపు సిద్ధాంతం ప్రకారం–'చెరువులో నిశ్శబ్దంగా ఉన్న నీటిని పైకి, కిందికి కదిలిస్తే, అందులో ఉన్న చేపలు భయంతో దిక్కుతోచక ఉపరితలానికి వస్తాయి. అప్పుడు జాలరి ఎలాంటి శ్రమ లేకుండా వాటిని తన వలలో వేసుకోవచ్చు'. ప్రస్తుత తెలంగాణ రాజకీయ దృశ్యాన్ని ఈ కోణం నుంచి చూసే..ఇక్కడ చెరువు–తెలంగాణ సమాజం అయితే, నీటిని కల్లోలపరుస్తున్నది–చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారికి లోపాయికారిగా సహకరిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. చేపలు–తెలంగాణ ప్రజలు, అస్తిత్వం, రాజకీయ చైతన్యం.తెలంగాణ ప్రభుత్వ అప్పులు మాకియవెల్లి తన 'ది ప్రిన్స్' గ్రంథంలో చెప్పిన అత్యంత దుర్మార్గపు నియమం ఏంటంటే, ఒక సామ్రాజ్యాన్ని శాశ్వతంగా లొంగదీసుకోవాలంటే అక్కడి ప్రజల ఉమ్మడి చైతన్యాన్ని, సంస్కృతిని ముందుగా విచ్ఛిన్నం చేయాలి. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ద్వయం సరిగ్గా ఇదే సూత్రాన్ని అమలు చేస్తున్నది. హైదరాబాద్‌లో తాము అక్రమంగా సంపాదించిన వేల కోట్ల రూపాయల విలువైన ల్యాండ్ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాలను కాపాడుకోవటం, రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాకుండా చూడటం. అదేవిధంగా తెలంగాణ ప్రాంతంలో శాంతిని విచ్ఛిన్నం చేసి అస్థిరపరచటం లాంటి లక్ష్యం కావచ్చు. కేసీఆర్ వస్తే తమ అక్రమాస్తుల పునాదులు కదులుతాయని భయపడే ఈ ఆంధ్రా శక్తులు, తెలంగాణ రాజకీయ క్షేత్రంలో రెచ్చగొట్టే సన్నివేశాలను సృష్టిస్తూ, కుల, వర్గ విభేదాల పేరిట, విగ్రహాల పేరిట, పదం లేదని..ఇలా ఎన్నో రూపాల్లో సాంస్కృతిక దాడులు.. నిరంతరం అలజడి సృష్టిస్తూనే ఉన్నారు.హైదరాబాద్ వార్తలు మాకియవెల్లి సిద్ధాంతం ప్రకారం..ఒక బలహీనమైన పాలకుడు తన ఉనికిని కాపాడుకోవటానికి శత్రువులతోనైనా చేతులు కలుపుతాడు. ఇపుడు గుంపు మేస్త్రీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి, ప్రజల దృష్టిని మళ్లించటానికి ఈ ఆంధ్రా శక్తులు సృష్టిస్తున్న కృత్రిమ అలజడిని ఒక సాధనంగా వాడుకుంటున్నాడు. కానీ ఆయన గమనించని విషయం ఏమిటంటే..ఈ చెరువు పూర్తిగా కల్లోలమైతే నష్టపోయేది తెలంగాణ సమాజమే. బహుశా తెలిసే ఆయన చేస్తూ ఉండవచ్చు. ఈ శక్తుల అంతిమ వ్యూహం కేవలం రాజకీయ లబ్ధి మాత్రమే కాదు; హైదరాబాద్‌ను ఒక కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలనే వ్యూహం కూడా ఉండవచ్చని పలువురు తెలంగాణవాదుల వాదన. ఒకవేళ హైదరాబాద్ కేంద్ర పరిధిలోకి వెళ్తే, ఇక్కడి చట్టాలు మారిపోతాయి, స్థానిక ప్రభుత్వాల అధికారం పోతుంది. అప్పుడు తాము చేసిన భూదందాలు శాశ్వతంగా సురక్షితంగా ఉంటాయని ఈ జాలర్లు లెక్కలు వేసుకుంటున్నారు. వారు విసురుతున్న వల కేవలం హైదరాబాద్ మీదనే కాదు, తెలంగాణ ప్రజా చైతన్యంపై, దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ అస్తిత్వం మీద. ఇక్కడి ప్రజల రాజకీయ అవగాహనను గందరగోళంలో ముంచి, వారిని మానసికంగా బలహీనపరచటమే ఈ ఆటలోని పెద్ద చేప దురుద్దేశం. ఎప్పుడైతే ప్రజలు తమ హక్కులను మరిచి ఈ కృత్రిమ వివాదాల వలలో చిక్కుకుపోతారో, అప్పుడు ఈ శక్తులు అనుకున్న కుట్రలు సులభమ వుతాయి. తెలంగాణ ప్రజలు ఈ మాకియవెల్లి కుతంత్రాలను గుర్తించి, ఆ వలలో చిక్కకుండా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన తరుణమిది. మొదటిది: ఎరను చూసి లొంగిపోవద్దుజాలరి విజయం చేపల ఆవేశం మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ శక్తులు కల్పిస్తున్న తీవ్ర వివాదాలు తెరపైకి వచ్చినపుడల్లా ప్రజలు ఎమోషనల్ కాకుండా ప్రశాంతంగా ఉండాలి. ఆ వివాదాలన్నీ హైదరాబాద్ మీద కుట్ర నుంచి, వారి అక్రమ భూసామ్రాజ్యాల రక్షణ నుంచి ప్రజల దృష్టిని మళ్లించటానికి వేసిన కృత్రిమ ఎరలు అని గుర్తించటమే మొదటి విజయం. ప్రజలు స్పందించటం మానేస్తే, జాలరి ఆట సాగదు.జ‌ఔఎ ఢ రాశీఝుశ్రీ +బఱఅవం రెండవది: బురద నీటిని నిజాలతో శుభ్రం చేయటండ నీటిని కల్లోలపరిచినప్పుడు అపోహలు, అబద్ధాలు తొందరగా వ్యాపిస్తాయి. దీనికి విరుగుడు 'నిజాల వెల్లడి'. తెలంగాణలోని అపారమైన రాజకీయ చైతన్యం ఉన్న యువత, సామాజిక మాధ్యమాలు, మేధావులు ప్రతి ఒక వివాదం వెనుక ఉన్న ఆర్థిక, భూసంబంధిత ప్రయోజనాలను విశ్లేషించి ప్రజల ముందు పెడుతూనే ఉండాలి. సంయమనం కోల్పోకుండా రాజకీయ డ్రామాలను, హైదరాబాద్‌లోని ల్యాండ్ బ్యాంకుల రక్షణ ప్రణాళికలను ఆధారాలతో సహా బట్టబయలు చేయటం ద్వారా ఆ బురద నీటిని మళ్లీ స్వచ్ఛంగా మార్చవచ్చు. మూడవది: 'తెలంగాణ అస్తిత్వాన్ని' రక్షణ కవచంగా మార్చుకోవటం... మాకియవెల్లి సిద్ధాంతం ప్రకారం చేపలను విడివిడి గుంపులుగా విడగొడితేనే వల వేయటం సులువవుతుంది. ఇక్కడి ప్రజలను కూడా కులాలు, పార్టీల పేరుతో విడగొట్టాలని చూస్తున్నారు. దీనికి విరుగుడు–మనమంతా ఒక్కటే అనే 'తెలంగాణ అస్తిత్వ' భావనను బలంగా పట్టుకుని ఉండటం. ఏ సమస్య ఎదురైనా 'దీనివల్ల తెలంగాణ సార్వభౌమత్వానికి, ఇక్కడి ప్రజలకు లాభమా? నష్ట మా?' అనే ఒక్క కోణం నుంచి ఆలోచిస్తే, శత్రువులు విసిరే విభజిత వలలు ముక్కలైపోతాయి. చివరిగా: అసలైన సమస్యలపై పాలకులను నిలదీయాలి. ప్రభుత్వం ఆంధ్రా శక్తుల నాటకాలకు సహకరిస్తే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తామనే హెచ్చరికను పంపాలి. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మళ్లీ రావటం ఖాయమనే ఆ శక్తులకు తెలిసిందే. చెరువులో చేపలన్నీ ఆందోళన, భయం లేకుండా, ఏకతాటిపై ఉండి, వలను స్పష్టంగా చూడగలిగితే..ఆ జాలరి ఎంత ప్రయత్నించినా ఒక్క చేపను కూడా పట్టలేడు. తెలంగాణ సమాజం తన చారిత్రక చైతన్యంతో నిశ్శబ్దంగా ఉంటూనే ఈ కుట్రను గమనిస్తే, ఆ జాలర్లు తమ వలలను సర్దుకుని ఖాళీ చేతులతో వెనుతిరగక తప్పదు.

## తెలంగాణపై కరువు పంజా తప్పదా



భూతాపం కారణంగా రుతుపవనాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఎప్పుడు వస్తాయో, ఎలా మారుతాయో చెప్పలేని అస్థిరతలను కలిగి ఉంటున్నాయి. పదేండ్లపాటు సాగిన ఇండో–జర్మన్ నిపుణుల అధ్యయనం ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. రుతుపవనాల రాక, ప్రభావం గురించి అంచనా వేయగలిగితే తగిన జాగ్రత్తలు పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు, అధికారులు, ప్రజలు, రైతులు సన్నద్ధంగా ఉంటారు. కానీ ఎప్పుడు ఎలా వస్తాయో తెలియకుండా ముందస్తుగా అంచనా వేయడానికి వీలు లేకుండా రుతుపవనాలు ముంచుకొస్తున్నాయి. ఇదంతటికీ కారణం భూతాపం అని అధ్యయనంలో నిపుణులు స్పష్టంచేశారు. కాబట్టి రుతుపవనాల ఆరంభం, ముగింపు పట్ల ఉన్న అభిప్రాయాలను మార్చుకోవాల్సిన అవసరమున్నది. ప్రస్తుతం ఎల్ నినో కరువు పరిస్థితులు పొంచి ఉన్న నేపథ్యంలో అప్రమత్తత చాలా అవసరం. వాతావరణ అధ్యయనంలో సాధారణంగా రెండు ప్రధానమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకటి అధిక వర్షాలు కురిసిన రోజుల సంఖ్య, రెండోది అధిక ఎండలు ఉన్న రోజుల సంఖ్య. ఇవే రెండు అంశాల ప్రాతిపదికన జరిగిన ఇండో–జర్మన్ అధ్యయనంలో నిపుణులు ఆసక్తికరమైన అంశాలను గుర్తించారు. రోజుకు 80 మిల్లీ మీటర్లకు పైగా కురిసే అత్యంత భారీ వర్షాలు ప్రస్తుతం రెండేండ్లకు ఓసారి కురుస్తున్నాయని అధ్యయనంలో తేలింది. కర్బన ఉద్గారాలు ఎలా ఉన్నప్పటికీ ఇలాంటి భారీ వర్షాలు 2050 నాటికి 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడయింది. ఇలాంటిది భారీ వర్షాలే వరదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అదే విధంగా అత్యంత ఉష్ణోగ్రతలు కలిగిన రోజుల సంఖ్య కూడా గణనీయంగా పెరగనున్నది. ప్రజల ఆరోగ్యాలపై ఎండలు ప్రతికూల ప్రభావం చూపుతా యి. ప్రమాదాలు జరగడం, కార్మికుల పనితీరు తగ్గిపోవడం కూడా కనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న సగటు తో పోల్చితే కర్బన ఉద్గారాల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ 2050 నాటికి ఏడాదిలో 20 రోజులు, 2100 నాటికి 40 రోజులు తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని అధ్యయనం హెచ్చరిస్తున్నది. మరోవైపు ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నట్టు ఇప్పటికే స్పష్టమవుతున్నది. భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం వేగంగా వేడెక్కడం వల్ల రుతుపవనాల వ్యవస్థ బలహీనపడుతున్నది. మరోవైపు హిందూ మహాసముద్రంలోని తూర్పు, పడమర ఉష్ణధ్రువాలు తటస్థ దశలో ఉండటంతో రుతుపవనాలకు అదనపు తేమ అందించే పరిస్థితి కనిపించడంలేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రుతుపవనాల ప్రవేశం ఆలస్యమైంది. దీంతో ఎల్ నినో ఏర్పడనున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణపై ఎల్ నినో తీవ్రమైన ప్రభావాలను చూపే అవకాశం ఉన్నది. ఇది కరువు పరిస్థితులను తీవ్రం చేయడంతోపాటు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇండో–జర్మన్ అధ్యయనంతోపాటు, భారత వాతావరణ విభాగం అంచనాలను గమనిస్తే ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో అత్యంత సవాళ్లు ఎదురుకానున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నాలుగు రోజులు ఆలస్యంగా జూన్ 8, 9 తేదీలలో జోగుళాంబ గద్వాల జిల్లా మీదుగా తెలంగాణలోకి ప్రవేశించాయి. కానీ ఇవి బలహీనంగానే ఉన్నాయి. జూన్, జూలైలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలపడి, వర్షపాతం భారీగా తగ్గిపోతుందని తెలుస్తున్నది. ఎల్ నినో ప్రభావం తెలంగాణలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలపై అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. హైదరాబాద్ సహా మధ్య తెలంగాణ ప్రాంతంలో మాత్రమే సగటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. అలాగే, వర్షాలు స్థిరంగా పడకుండా తక్కువ సమయంలో భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసి, ఆ తర్వాత వారాల తరబడి ఎండలు కొనసాగే పరిస్థితి ఏర్పడవచ్చు.+వశీస్త్రతీఝుజూష్ట్రఱఎ =వటవతీవఅఓవ సాధారణంగా రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత ఎండలు తగ్గుతాయి. కానీ ఈ సారి ఎల్ నినో ప్రభావం వల్ల రుతుపవనాల ప్రవేశం తర్వాత కూడా చాలా ప్రాంతాల్లో వడగాలులు, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఎగువ రాష్ట్రాల నుంచి కృష్ణా, గోదావరి నదుల్లోకి వచ్చే వరదపై తెలంగాణ నీటి అవసరాలు ఆధారపడి ఉంటాయి. కానీ కర్నాటక, మహారాష్ట్రల్లో కూడా కరువు పరిస్థితులే నెలకొనడంతో జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు నిలిచిపోవడం, తగ్గిపోవడం వంటివి జరుగుతాయి. ఫలితంగా తెలంగాణలో నీటి ఎద్దడి సమస్య ఎదురవుతుంది ఈ నేపథ్యంలో కరువును ఎదుర్కోవడంలో కాళేశ్వరం ప్రాజెక్టు కీలక పాత్ర పోషించగలదని నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు అంతుపట్టని వాతావరణం, కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. రైతులకు సరైన సమయంలో సూచనలు అందించాలి. సాగునీటి నిర్వహణ, పెట్టుబడి సాయం పథకాలను సక్రమంగా అమలు చేయాలి. పంట కొనుగోలు విధానాలు, ఆహారభద్రత పథకాలను మెరుగుపర్చాలి. ఇవే వ్యవసాయరంగ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.

# పాలమూరుపై ప్రేలాపనలు




పరిపాలనలో హిట్లర్ ఆదర్శమన్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రచారంలో గోబెల్స్ అంటే ప్రీతి. అబద్ధాన్ని పదేపదే వల్లె వేస్తే నిజమని అమాయక ప్రజలు నమ్ముతారని ఆయన అనుకుంటారు. కాకపోతే అప్పుడప్పుడూ పచ్చి అబద్ధాలూ ఆడేస్తారు. పాలమూరు నీటిగోస తీర్చే ప్రాజెక్టుపై తాజాగా ఆయన అవాకులు, చవాకులు మాట్లాడటం అందుకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమనాయకుడు కేసీఆర్ పాలనా పగ్గాలు చేపట్టి, తెలంగాణ నీటి గోసను తీర్చేందుకు అపర భగీరథుడై ఎన్నో ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. గోదావరిపై తెలంగాణ వరప్రదాయినిగా నిలుస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. దక్షిణ తెలంగాణ సాగు, తాగు నీటి కష్టాలు తీర్చేందుకు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పట్టాలెక్కించారు. కృష్ణా నదిపై శ్రీశైలం బ్యాక్ వాటర్ సోర్స్‌గా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రూపొందించింది. 2016 జూన్ 16న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. ప్రాజెక్టులో ఐదు స్టేజీల ద్వారా 90 టీఎంసీల నీటిని 12.3 లక్షల ఎకరాలకు మళ్లించేందుకు రూ.27,000 కోట్లు నిధులు వెచ్చించింది. పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు నిర్మించి, 90 శాతం పనులు పూర్తి చేసింది. 27,081.95 ఎకరాలు అవసరమైతే, 26,950.97 ఎకరాలను సేకరించింది. భూసేకరణ చట్టం–2013 ప్రకారం మెరుగైన పరిహారం చెల్లించింది. కృష్ణా నది నుంచి నార్లాపూర్ వద్ద భారీ మోటర్లతో నీటిని ఎత్తిపోసేలా పనులను వేగంగా చేపట్టింది. 2023 సెప్టెంబర్ 23న కృష్ణా జలాలను ఉప్పొంగించింది. లక్షలాది మంది రైతుల కోసం తమ పంట భూములనువేలాది మంది రైతులు త్యాగం చేశారు. సహాయ, పునరావాసంలో భాగంగా నిర్మించిన కాలనీలు మినీ పట్టణాలుగా కనిపిస్తున్నాయి. ఇంత జరిగినా బీఆర్ఎస్ భూసేకరణ జరుపనే లేదని సీఎం అనటం అర్థరహితం. భూసేకరణే జరుపకుండా గాలికి వదిలేసిన ప్రాజెక్టుల్లో తాను నీళ్లు ఎలా నింపాలని అమాయకత్వం నటించడం ఆయనకే చెల్లింది. ప్రాజెక్టులో ప్రధానమైన నార్లాపూర్–ఏదుల రిజర్వాయర్‌కు ఓపెన్ కెనాల్ కీలకమైంది. ఈ మార్గం మొత్తం రాయితో కూడి ఉంటుంది. ఇందులో బీఆర్ఎస్ ప్రభుత్వం 1.3 లక్షల క్యూబిక్ మీటర్ల రాయిని తొలగించింది. మరో 30 వేల క్యూబిక్ మీటర్ల రాయిని తొలగిస్తే నీటిని నేరుగా కరివెన రిజర్వాయర్‌కు పంపింగ్ చేయవచ్చు. కానీ 30 నెలలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టును పట్టించుకోలేదు. సర్కార్ అలసత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని, పాదయాత్ర చేస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించటంతో పాలక పక్షం ఉలిక్కిపడింది. బీఆర్ఎస్ నేతలు ఉద్యమ కార్యాచరణకు పూనుకోవటంతో సీఎం రేవంత్ ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. ఈ నెల 5న పాలమూరు ప్రాజెక్టుల పరిశీలన పేరిట హడావుడి చేసి, భూసేకరణపై నోటికొచ్చింది మాట్లాడటం చౌకబారు రాజకీయమే. రెండున్నరేండ్లలో మిగిలిన పదిశాతం పనులు కూడా చేయలేని ముఖ్యమంత్రి అడ్డగోలు ప్రేలాపనలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. మరో 4వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉన్నదని ఆయన చెప్పుకొచ్చారు. కానీ వాస్తవానికి మరో 128.75 ఎకరాలు సేకరిస్తే సరిపోతుంది. సమైక్య పాలనలో వలసపోయిన ప్రజలు ప్రత్యేక రాష్ట్రంలో తిరిగి పాలమూరుకు వచ్చారు. తమ పొలాలకు కాలువలతో నీళ్లు వస్తుంటే సంబురపడ్డారు. కానీ ప్రాజెక్టు పూర్తయ్యే దశలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తొమ్మిదిన్నరేండ్లపాటు అస్తిత్వంతో ఆత్మగౌరవంతో బతికిన తెలంగాణపై మళ్లీ సమైక్య కుట్రలు మొదలయ్యాయి. బనకచర్లకు ఒప్పుకొంటే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తారని కేంద్రం చెప్తున్నది. అంటే తెలంగాణ ప్రాజెక్టులకు చంద్రబాబు నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాల్సిన దుస్థితిలో తెలంగాణ పాలనా వ్యవస్థ అఘోరించిందన్నమాట. తాము ఒప్పందానికి సిద్ధమని, ఇది తెలంగాణ ప్రజలకు శుభవార్త అంటూ ఇటీవల పాలమూరు పర్యటనలో రేవంత్‌రెడ్డి తలాతోక లేని మాటలు మాట్లాడారు. ఇదంతా చూస్తుంటే ఆయన పాలమూరు ప్రాజెక్టులను పరిశీలించడానికి వెళ్లినట్టు లేదు. ఏపీ బనకచర్ల ప్రాజెక్టును పట్టాలెక్కించే బాధ్యతను భుజాలకెత్తుకుని కిందామీద పడుతున్నట్టు కనిపిస్తున్నది. రేవంత్‌రెడ్డి తన నాలుకను ఎన్ని అష్టవంకర్లు తిప్పినా ప్రజలు ఆయన మాటలను నమ్మే స్థితిలో లేరని ఆయన తెలుసుకోవాలి. కేసీఆర్ చేసిన కృషి కండ్లెదుటే ఉన్నది. చివరి దశను పూర్తి చేయకుండా చేసుకోలేనంత అమాయకులు కాదు.. తెలంగాణ ప్రజలు, మరీముఖ్యంగా పాలమూరు బిడ్డలు.

## కాంగ్రెస్ నేతల పాపం.. కరువు జిల్లాగా శాపం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంటి గోబెల్స్ వారసులు చెప్పే అబద్ధాలు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఇటీవల సీఎం హోదాలో పాలమూరులో రేవంత్ చెప్పిన పచ్చి అబద్ధాలు కంపరమెత్తించాయి, కలవరపెట్టాయి. పాలమూరును మరింత చీకట్లోకి నెట్టాయి. చేసిన వాగ్దానాలు, ఇచ్చిన గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేని దుర్మార్గం.తెలంగాణ ప్రభుత్వ అప్పులు రైతుబంధు, రైతుబీమా ఇవ్వలేక, ఆరుగాలం రైతు శ్రమించి పండించిన పంటను కొనలేక, కొన్న ధాన్యానికి బిల్లులు ఇవ్వలేక నానా అవస్థలు పడుతున్నారు. రైతులకు ఇరవై నాలుగు గంటలు కరెంటు ఇవ్వలేక, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ లాంటి పథకాలు కొనసాగించలేక తెలంగాణ తొలి ముఖ్యమంత్రిపై చిల్లర మాటలు మాట్లాడారు. ప్రజలను పక్కదారి పట్టించటానికి తొమ్మిదిన్నరేండ్ల బంగారు తెలంగాణపై తప్పుడు ఆరోపణలు చేశారు. వాస్తవానికి పాలమూరు జిల్లా ఆకలి జిల్లాగా మార్చిందే ఆనాటి కాంగ్రెస్, టీడీపీ పాలకులు. దత్తత పేరిట వలసలకు శాశ్వత జిల్లాగా మార్చిన ప్రబుద్ధులే ఆనాటి వంచక పాలకులు. కరుణ లేని కాంగ్రెస్ నాయకుల వల్లనే పాలమూరు జిల్లా వాసులు శ్రమజీవులు, వలస జీవులుగా మారారు. 'కాంగ్రెస్‌తోపాటు మీ గురువు బాబు పాలించిన మొత్తం కాలమంతా అరిగోసపడ్డాం. అప్పులపాలై పరాయి దేశం బండెక్కాం. తలాపున నదులున్నా చుక్క నీరులేక విలవిల్లాడిపోయాం. నీళ్లు, భూములు దండిగా ఉన్నా మా బతుకులు ఇలా కాలిపోవటానికి నయవంచక కాంగ్రెస్ పాలన, మీ గురువు చలువేనని మరచి, పాలమూరు సభలో శ్రీశైలం ప్రాజెక్ట్ కట్టింది తామేనంటూ చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్ట్ వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఒరిగిందేమీ లేదన్న సంగతి తెలియకపోవటం మీ అజ్ఞానానికి నిదర్శనం'. పాలమూరు ఎద మీద కృష్ణమ్మ దాదాపు మూడు వందల కిలోమీటర్లు ప్రవహిస్తున్నది. 74 శాతం కృష్ణా పరీవాహకమంతా ఈ జిల్లాలో ఉన్నది. న్యాయంగా కృష్ణా నీటిపై సర్వహక్కులు మహబూబ్‌నగర్‌కే ఉన్నాయి. కాంగ్రెస్, టీడీపీ పరిపాలన నిర్వాకం వల్ల పాలమూరుకు దక్కాల్సిన నీటినంతా దోచుకుపోయారు. కృష్ణా బేసిన్‌లో ఉన్న పాలమూరును పడావు బెట్టి, ఎడారిగా మార్చి, పెన్నా బేసిన్‌లో ఉన్న రాయలసీమ ప్రాంతానికి అన్యాయంగా తరలించిన నీటి లెక్కలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి. 'సీమలో పెద్ద పెద్ద సాగునీటి బరాజ్‌లు నిర్మించారు. మాకు దక్కాల్సిన మా పాలమూరు నీటిని డబ్బు, పరపతి సంపాదించి పెట్టిన మద్రాస్ నగరానికి తరలించారు. బలవంతంగా నీటిని దోపిడీ చేశారు. శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్న నీటిని కూడా కొల్లగొట్టే విధంగా పోతిరెడ్డిపాడు షట్టర్లు నిర్మించారు. తామే నిర్మించామని గొప్పగా చెప్తున్న శ్రీశైలం ప్రాజెక్ట్ వల్ల పాలమూరు జిల్లాకు జరిగిన మేలేమిటో చెప్పండి. మీవల్ల మా జిల్లా విధ్వంసానికి గురైంది'. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వల్ల పాలమూరుకు జరిగినంత అన్యాయం ఏ జిల్లాకూ జరుగలేదు. నిజాంకాలం నాటి సాగునీటి ఒప్పందాలను మీ కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా వదిలేసింది. తుంగభద్ర డ్యామ్ నుంచి తొంభై టీఎంసీల నీరు ఇవ్వాలని నిజాం కాలంలో ఒప్పందం జరిగింది. కాలువ కూడా తీశారు. తర్వాత హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్రాలో విలీనం చేయటంతో తుంగభద్ర డ్యామ్ కర్నాటకకు పోయింది. కాంగ్రెస్ సరైన వాదనలు చేయకపోవటంతో ఆ కాలువ మట్టిలో పూడుకుపోయింది.హైదరాబాద్ వార్తలు హైదరాబాద్, మద్రాస్ రాష్ట్రాల మధ్య తుంగభద్ర నది ఉన్నందువల్ల ఈ నదిలో ఇరు ప్రాంతాలకు సమాన హక్కులు ఉన్నాయని నిజాం హయాంలో ఒప్పందం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు కావటం వల్ల ఆ ఒప్పందం హుష్‌కాకి అయింది. నీటినంతా కేసీ కెనాల్ ద్వారా రాయలసీమకు తరలించారు. ఆర్డీఎస్ కాలువ ద్వారా రావాల్సిన 15.9 టీఎంసీల నీళ్లు రాకుండా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డైనమైట్లతో పేల్చేశాడు. ఇప్పుడు ఆర్డీఎస్‌కు ఆరు టీఎంసీల నీరు కూడా రావటం లేదు. చివరి ఆయకట్టుకు నీళ్లు అందించటానికి ప్రత్యామ్నాయంగా తుమ్మిళ్ల లిఫ్ట్‌ను బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నిర్మించారు. తుంగభద్ర నీటి విషయంలో కాంగ్రెస్, టీడీపీ పోటీ పడి చాలా అన్యాయం చేశాయి. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి దగ్గర నిర్మించిన సుంకేసుల ప్రాజెక్ట్‌కు తుంగభద్ర నదినంతా మలుపుకున్నారు. ఎడమ కాలువ లేని ప్రాజెక్ట్ బహుశా దేశంలో ఏదైనా ఉన్నదంటే ఇది తప్పా ఇంకొకటి ఉండకపోవచ్చు. పర్యావరణం కోసం కనీసం ఒక షట్టర్ ద్వారా తెలంగాణ ప్రాంతానికి నీరివ్వాలని ఆనాటి జీవోలో పొందుపర్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ షట్టర్‌ను కూడా, మళ్లీ తీయటానికి వీల్లేకుండా వెల్డింగ్‌తో శాశ్వతంగా మూసివేసింది. నారాయణపూర్ డ్యామ్ ద్వారా పాలమూరుకు రావాల్సిన నీళ్లు కాంగ్రెస్ వైఖరి వల్ల ఆగిపోయాయి. భీమా ప్రాజెక్ట్, కోయిల్‌సాగర్ కాంగ్రెస్, టీడీపీ వల్లే ఆగమయ్యాయనేది పాలమూరు జిల్లాలో కూలిన మట్టిగోడలే సాక్ష్యం. కొన్నేండ్లపాటు పచ్చగా ఉన్న ఊళ్లను కాంగ్రెస్ పాలకులు వల్లకాడు చేస్తున్నారు. నాటి వలస పాలన పరిస్థితులు మళ్లీ దాపురించాయి. 'మా బాపు కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే మా చీకటి బతుకుల్లోకి వెలుతురు వచ్చింది. మీవల్ల విధ్వంసమైన పాలమూరు పచ్చబడింది. మీరు అప్పనంగా అప్పగించిన నీళ్లుపోను..మిగిలిన నీటి వనరులను వినియోగంలోకి తెచ్చారు. ఒక్కో నీటిబొట్టును ఒడిసిపట్టి మా పొలాలకు మళ్లించారు. సంప్రదాయబద్ధమైన చెరువులను మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించారు'. ఉద్యమకాలంలోనే పాలమూరు నీటిగోసపై టీఆర్ఎస్ ఉద్యమం నడిపింది. పార్టీ అధినేత కేసీఆర్ పాదయాత్ర చేసి, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం ద్వారా నీటి లభ్యతపై అధ్యయనం చేయించారు. వారి సూచన మేరకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో తొంభైశాతం పనులు పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్టులో తెలంగాణ నీటి హక్కులను హరించటానికి గురుశిష్యులు ఇద్దరూ పన్నాగం పన్నుతున్నారు. కేవలం పది శాతం మాత్రమే మిగిలి ఉన్న ప్రాజెక్టులను సందర్శించి మొత్తం తామే చేసినట్టు ప్రగల్భాలు పలుకుతున్న రేవంత్‌ను ప్రజలు నమ్మటానికి సిద్ధంగా లేరు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించటం ఖాయం.

# ఫ్లాట్ లాక్ చేసి ఉందిగది లోపల మహిళా ప్రొఫెసర్ హత్య



న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ఓ టీచర్ హత్యకు గురైంది. వసుంధర ఎన్‌క్లేవ్‌లో తన ఫ్లాట్‌లో ఆమె శవమై తేలింది. ఢిల్లీ పోలీసులు ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నారు. శివాజీ కాలేజీలో దేవోస్మితా పాల్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈస్ట్ ఢిల్లీలోని వసుంధర ఎన్‌క్లేవ్‌లో ఉన్న సత్యం అపార్ట్‌మెంట్స్‌లో ఆమె ఒంటరిగా నివసిస్తున్నది. ఆమె భర్త బెంగుళూరులో ఉంటున్నారు. న్యూ అశోక్ నగర్ పోలీసు స్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం 2.35 నిమిషాలకు తమకు ఫోన్ కాల్ వచ్చినట్లు పోలీసులు చెప్పారు. 49 ఏళ్ల దేవారతి పౌల్ ఆ ఫోన్ చేశాడు. వటవతీవఅఓవతన సోదరి ఇంట్లో నిర్జీవంగా పడి ఉన్నట్లు ఫిర్యాదు చేశాడు. ఉదయం నుంచి ఆమె ఫ్లాట్ డోర్ లోపలి నుంచి లాక్ వేసి ఉందన్నాడు. దేవోస్మితా పౌల్ తన ఫోన్‌కు స్పందించడం లేదని పోలీసులకు చెప్పారు. ఏదో జరిగిందన్న అనుమానంతో సోదరుడు దేవారతి పౌల్ ఆ ఇంటి లాక్‌ను బ్రేక్ చేసి ఫ్లాట్‌లోకి ప్రవేశించాడు. ప్రొఫెసర్ దేవోస్మితా ఇంట్లో చనిపోయి కనిపించిందన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆమె తలపై గట్టి దెబ్బ తగిలింది. తలపై చాలా లోతుగా గాయమైనట్లు గుర్తించారు. చేతి మణికట్టు దగ్గర కత్తితో కోసేశారు. పోస్టుమార్టమ్ కోసం ఆమె బాడీని ఎల్‌బీఎస్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇంట్లో ఉన్న బంగారం, నగదు అలాగే ఉన్నాయని, దొంగతనం జరిగినట్లు ఆనవాళ్లు లేవని పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో పోలీసులు మర్డర్ కేసు నమోదు చేశారు. కేసును విచారించేందుకు కొన్ని బృందాలుగా ఏర్పడ్డారు. ఆధారాలు దొరికాయని, త్వరలోనే నిందితులను అరెస్టు చేయనున్నట్లు పోలీసులు చెప్పారు.